ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 11 ఫిబ్రవరి 2024 | 3

15 వరకు కాటన్ బ్యారేజ్‌పై రాకపోకలు నిలిపివేత

- వివరాలు 5లో

- ఆందోళన చెందుతున్న ఆశావహ అభ్యర్థులు
- ఏ సీట్లు ఏ పార్టీకి కేటాయిస్తారోననే ఉత్కంఠ
- జనసేన-బీజేపీ కూటమికి జిల్లాలో మూడు సీట్లా?
- మా పరిస్థితి ఏంటంటున్న టీడీపీ ఆశావహులు
- రోజురోజుకూ మారుతున్న రాజకీయాలు



వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల పొత్తుల నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో టిక్కెట్లు ఆశిస్తున్న అభ్యర్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. పొత్తులు, సీట్ల సర్దుబాట్లు ఇంకా ఓ కొలిక్కి రాకపోవడంతో టిక్కెట్ల కోసం ఎదురుచూపులు చూస్తున్న రాజకీయ పార్టీల ఇన్‌చార్జిలు, ఆశావహులు ఆందోళనకు గురవుతున్నారు. సీట్ల సర్దుబాటులో ఎవరి సీటు గల్లంతవుతుందోననే భయం వారిలో నెలకొంది. రోజురోజుకూ మారుతున్న రాజకీయ పరిణామాలు, సోషల్ మీడియాలో వస్తున్న పోస్టింగులతో మరింత కలవరపాటుకు గురవుతున్నారు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఆశావహ అభ్యర్థులు. ప్రస్తుతం టీడీపీ, జనసేన పొత్తుతో పాటు బీజేపీ కూడా కూటమిగా ఏర్పడి మూడు పార్టీలు రాష్ట్రంలో కలిసి పోటీ చేస్తాయన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మూడు, నాలుగు అసెంబ్లీ సీట్లు జనసేన, బీజేపీలకి కేటాయించే పరిస్థితులు నెలకొనడంతో ఆయా నియోజకవర్గాల్లో ఆశలు పెంచుకున్న టీడీపీ నాయకుల్లో అయోమయం నెలకొంది.

పొత్తుల వేళ...

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాజోలు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి జనసేన బరిలోకి దిగుతుందని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఇప్పటికే చేసిన ప్రకటన అక్కడి టీడీపీ నేతలకు షాక్ ఇచ్చినట్టయింది. నియోజకవర్గంలో టీడీపీ మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో బలపడినట్టు భావిస్తున్నారు. అయితే ఆ స్థానాన్ని జనసేనకు ఇవ్వడం వల్ల ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు నేతలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ జనసేన క్యాడర్ నుంచి స్పష్టమైన సంకేతాలు లేక ఇబ్బందులకు గురవుతున్నట్టు సమాచారం. సీనియర్ ఐఏఎస్ అధికారి దేవ వరప్రసాద్, జనసేన నేత బొంతు రాజేశ్వరరావు, డాక్టర్ రాపాక రమేష్‌తో పాటు పలువురు టిక్కెట్టు కోసం ప్రయత్నిస్తున్నారు. జనసేన సిటింగ్ స్థానమైన రాజోలు నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా ఎవరు ఎన్నికల బరిలోకి దిగుతారనేది ఉత్కంఠంగా మారింది.

అయితే జిల్లాలో జనసేనకు మరో రెండు స్థానాలు కావాలని ఆ పార్టీ నేతలు పట్టుబడుతున్నారు. దీనిలో భాగంగా పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయిస్తారా లేక పొత్తులో భాగంగా బీజేపీకి ఇస్తారా అనేది తాజాగా చర్చకు కారణమైంది. పోలీసు అధికారి అయిన గిడ్డి సత్యనారాయణను జనసేన ఇన్‌చార్జిగా ఇటీవల ఆ పార్టీ నియమించడంతో ఆయనకే పి.గన్నవరం స్థానం కేటాయించారనే భావనతో జనసేన నాయకులంతా నియోజకవర్గంలో విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. అయితే ఇక్కడ టీడీపీకి ఇస్తారా లేక బీజేపీకి ఇస్తారా అనేది చర్చకు దారితీసింది.

నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్‌ను నియమించినప్పటికీ ఆయన లోక్‌సభ స్థానం కోసం పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడకు ఇతర నియోజకవర్గాల నుంచి పార్టీ నేతలను రప్పిస్తారా లేక బీజేపీకి కేటాయించి మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమాకు ఇస్తారా అనుకుంటున్నారు. బీజేపీ తరపున పి.గన్నవరం నుంచి మానేపల్లి అయ్యాజీ వేమా, రామచంద్రపురం నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు పోటీ చేస్తారని ఆ పార్టీ వర్గీయులు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు.

ఇక కొత్తపేట నుంచి టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఎన్నికల బరిలో ఉంటారని క్లారిటీ వచ్చినట్టు ఇప్పటికే పార్టీ నుంచి సంకేతాలు కూడా అందాయని ప్రచారం జరుగుతోంది. కానీ జనసేన ఇన్‌చార్జి అయిన బండారు శ్రీనివాసరావు ఈసారి జనసేనకే కొత్తపేట స్థానం ఇవ్వాలని ఆ పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు.

అమలాపురం ఎస్సీ రిజర్వుడు స్థానాన్ని జనసేనకే కేటాయించాలంటూ ఆ పార్టీ వర్గీయులు పట్టుబడుతున్నారు. ఇక్కడ గతంలో వచ్చిన ఓటింగ్ ఆధారంగా జనసేనకు కేటాయిస్తే గెలుపు సున్నాయానమని ఆ పార్టీ నుంచి టిక్కెట్టు ఆశిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు, లోక్‌సభ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్ చెప్తున్నారు. అయితే ఈ స్థానాన్ని ఎట్టి పరిస్థితిల్లోనూ వదులుకునే ప్రసక్తే లేదని టీడీపీ వర్గీయులు పేర్కొంటున్నారు. టీడీపీ నేతలు తమ వ్యూహరచనతో అన్ని రకాలు గాను నియోజకవర్గాన్ని టీడీపీకే కేటాయించాలంటూ ఒత్తిడి పెంచారు. పైగా నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావుతో పాటు ఆశావహులైన అభ్యర్థులు రోజురోజుకూ పెరుగుతున్నారు. వారిలో మహిళా కోటా నుంచి మాజీ ఎమ్మెల్యే దంపతులైన చిల్లా జగదీశ్వరి-చిల్లా పురుషోత్తం, నాగాబత్తుల శ్రీనివాస్, పరమట శ్యామ్, పోతుల సుభాష్‌చంద్రబోస్‌తో పాటు మాజీ ఎంపీ బుచ్చిమహేశ్వరరావు తనయురాలు డాక్టర్ సత్యశ్రీ, మరికొందరి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

రామచంద్రపురం, ముమ్మిడివరం స్థానాల్లో ఏదో ఒకటి జనసేనకు ఇవ్వాలంటూ ఆ పార్టీ అడుగుతోంది. రామచంద్రపురాన్ని బీజేపీకి కేటాయించాలని ఆ పార్టీ నాయకులు కోరుతున్నారు.

పొత్తులో భాగంగా సీట్ల సర్దుబాటు జరిగితే తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటంటూ సీట్లు కోల్పోయే అవకాశమున్న ఆశావహ నేతలు అధిష్ఠానంపై ఒత్తిడి పెంచడంతో పాటు అవసరమైతే తిరుగుబాటు చేసి ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు మరలే అవకాశాలు ఉన్నట్టు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఏడు నియోజకవర్గాల పరిధిలో జనసేన-బీజేపీ కూటమికి మూడు సీట్లు కేటాయించే పరిస్థితి టీడీపీలో కొన్నేళ్లుగా కష్టపడుతున్న ఇన్‌చార్జిలు, నేతలకు ఆశనిపాతంలా మారనుంది.



త్వరలో పవన్ రాక

- జనసేనాని ఉభయ గోదావరి జిల్లాల పర్యటన ఖరారు
- ఈనెల 14 నుంచి 17 వరకు పర్యటన
- టీడీపీ నేతలతోనూ సమావేశమయ్యే అవకాశం
- కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంల్లో మూడురోజులపాటు ఉండేలా ప్రణాళిక

- 5లో



శనేశ్వర ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

మందపల్లి శనేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, ఫిబ్రవరి 10: మందపల్లి శనేశ్వర (మందేశ్వర) ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. స్వామివారి సర్వదర్శనం అనంతరం తైలాభిషేకాలకు క్యూకట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,20,368, అన్నప్రసాద విరాళాల కింద రూ.43,579 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనరు, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి

14న జిల్లా స్థాయి 'ఇన్‌స్పైర్' ప్రదర్శన

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 10: ఈ నెల 14న నిర్వహించనున్న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాల్సిన బాధ్యత విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులపై ఉందని డీఈవో ఎం.కమలకుమారి సూచించారు. పట్టణంలోని సూర్యనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే ప్రదర్శన ముందస్తు ఏర్పాట్లపై జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శనివారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రదర్శన నిర్వహణకు విధులు కేటాయించిన సిబ్బందికి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాస్థాయి ప్రదర్శనలో అత్యుత్తమ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు రెండంచెల విధానంలో ఎంపిక చేస్తామన్నారు. నిష్ణాతులైన వారిని న్యాయనిర్ణేతలుగా ఎంపిక చేశామన్నారు. ఎన్ఐఎఫ్ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల రూపకల్పన జరిగిందని సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. హెచ్ఎం ఎస్.రాజరాజేశ్వరి, కామన్ ఎగ్జామినేషన్ బోర్డు జిల్లా కార్యదర్శి బి.హనుమంతరావు, ఎంఈవో ఎస్.దుర్గాదేవి, నిమ్మకాయల గణేశ్వరరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ సభ్యులు

'నాడు-నేడు' పథకంలో వేల కోట్లు స్వాహా

- టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజు

అంబాజీపేట, ఫిబ్రవరి 10: వైసీపీ అధికారంలోకి వచ్చాక నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాలలకు రంగులు వేశామని చెప్పి సుమారు రూ.3వేల కోట్లు స్వాహా చేశారని తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్ రాజు ఆరోపించారు. అంబాజీపేట ఎస్ఎన్ఎం కళాశాలలో శనివారం 'విద్యార్థీ మేలుకో... భవిష్యత్ కాపాడుకో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌రాజు మాట్లాడుతూ సీఎం జగన్ విద్యార్థులకు మేనమామ అవుతానని చెప్పి కంసుడిలా తయారై వారిని నయవంచనకు గురచేశారన్నారు. టీడీపీ హయాంలో పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు ఇవ్వడమే కాకుండా బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల ఉన్నత చదువులకు బాట వేశారని చెప్పారు. జగన్ హయాంలో పీజీ విద్యార్థులకు మొండిచేయి చూపారన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి కట్టా ప్రభాకర్, పి.గన్నవరం నియోజకవర్గ అధికార ప్రతినిధి యల్లమిల్లి నాగేంద్ర, నాయకులు మందా రాజేష్, నేదునూరి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో అక్రమంగా నిల్వ చేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

1,200 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 10: స్థానిక మార్కెట్ వీధిలో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై అందించిన సమాచారంతో రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులు ఓ ఇంట్లో తనిఖీ చేసి సుమారు 1,200 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. ఆ సరుకును నడిపూడి గ్రామానికి చెందిన అరిగెల వీరాంజనేయులుదిగా గుర్తించారు. రేషన్‌కార్డుదారుల నుంచి కిలో రూ.20కి కొనుగోలు చేసి ఇతర వ్యాపారులకు రూ.22కు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. రూ.54,600 విలువచేసే పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి 6(ఎ) కింద కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతర నిఘా కొనసాగుతుందని ఇన్‌స్పెక్టర్ నాగవెంకటరాజు తెలిపారు. ఎస్ఐ జగన్నాథరెడ్డి, భారతి, జీవానందం, వీరబాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.



ప్రారంభ సభలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమణ

ప్రకృతి ఆధారిత పంటలకు పెద్ద పీట

అర్తమూరులో సోలార్ ఆధారిత మినీ రైస్‌మిల్లు యూనిట్ ప్రారంభం

మండపేట, ఫిబ్రవరి 10: ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉద్యానవన శాఖాధికారి బీవీ రమణ అన్నారు. మండలంలోని అర్తమూరులో ప్రభుత్వ, సెల్కో ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోలార్‌తో నడిచే రైస్‌మిల్లు మినీ యూనిట్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయం చేస్తున్న చింతా బాబుల్‌రెడ్డి ఈ యూనిట్ ఏర్పాటు చేశారు. ఇది జిల్లాలో రెండో యూనిట్ కావడం విశేషం. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రకృతి సేద్యం చేసే రైతులతో పాటు జిల్లాలోని వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. తొలిసారిగా సోలార్‌తో నడిచే మినీ రైస్‌మిల్లులను రాష్ట్రంలో 100 వరకు ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని అధికారులు చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో 71శాతం సబ్సిడీతో యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో లభ్యమవుతున్న కాలుష్యరహిత పంటల నుంచి బయటపడి ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలను ప్రజలు వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పలువురు సూచించారు. సెల్కో సంస్థ ప్రతినిధి చంద్రశేఖరరావు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కోనసీమ జిల్లా ప్రతినిధి నరేష్, సెల్కో ప్రతినిధి శ్రీనివాసరావు, జిలాని, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి నీలకంఠేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



అంతర్వేది, ఫిబ్రవరి 10: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న అంతర్వేది క్షేత్రంలో భక్తుల తొలి దర్శనం అంటుకుంటున్న శ్రీపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు జరగనున్నాయి. తొలి రోజైన ఆదివారం ఉదయం 9 గంటలకు స్వామివారికి అభ్యంగన స్నానం, వస్త్రాలంకరణ, రాత్రి 7 గంటలకు సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పంచగవ్యం, అస్త్ర రాజార్చన, వాస్తుపూజ, ధ్వజారోహణం, బలిహరణజరుపుతారు. సోమవారం ఉదయం 8 గంటలకు నిత్యోపాసన, బలిహరణ, రాత్రి 7 గంటలకు నంది వాహనంపై గ్రామోత్సవం, రాత్రి 8.30 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతాయి. మంగళవారం నిత్యోపాసన, బలిహరణ, బుధవారం ఉదయం 9 గంటలకు త్రిశూల స్నానం, పూర్ణాహుతి, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణ, శ్రీపుష్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

నేడు దళిత సింహగర్జన సభ

● వేమగిరిలో ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎంపీ హర్షకుమార్ ...5లో

త్వరలో పవన్‌కల్యాణ్ రాక

- జనసేనాని ఉభయ గోదావరి జిల్లాల పర్యటన ఖరారు ● ఈనెల 14 నుంచి 17 వరకు పర్యటన
- టీడీపీ నేతలతోను సమావేశమయ్యే అవకాశం
- కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంల్లో మూడురోజులు ఉండేలా ప్రణాళిక

సర్పవరం జంక్షన్(కాకినాడ), ఫిబ్రవరి 10: త్వరలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జిల్లాల పర్యటనకు రానున్నారు. దీనికి సంబంధించి ఉభయ గోదావరి జిల్లాల్లో ఆయన పర్యటన ఖరారైంది. ఈనెల 14వ తేదీ నుంచి 17వరకు భీమవరం, అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరంల్లో పర్యటించి పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులతో భేటీ కానున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ మంగళగిరి నుంచి ఒక ప్రకటనలో వివరాలు తెలియజేశారు.

ఎన్నికలపై దిశానిర్దేశం

రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గతేడాది డిసెంబర్ నెలాఖరులో నాలుగురోజులపాటు కాకినాడలో పవన్‌కల్యాణ్ పర్యటించి పార్టీ పటిష్టత, రాబోయే ఎన్నికల్లో అభ్యర్థుల పాత్ర, ప్రణాళికలపై సమాలోచనలు చేసి పార్టీ క్యాడర్‌కు ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా కాకినాడ సిటీపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన పవన్‌కల్యాణ్ డివిజన్లవారీగా పార్టీ పరిస్థితి, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఇంకా మరో 25 డివిజన్లపై సమీక్ష చేయాల్సి ఉంది. ఈసారి మిగిలిపోయిన డివిజన్లలపై సమీక్ష చేపట్టనున్నారు. జనసేనకు రాజకీయంగా ఈ మూడు జిల్లాలు కీలకం కావడంతో ఇక్కడే అధిక సీట్లు కైవసం చేసుకునేందుకు పవన్ రాజకీయ సమాలోచనలు, ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి కేడర్‌ని ఎన్నికలకు సమాయత్తం చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో వైసీపీకి ఒక్కసీటు రాకుండా చేయాలనే లక్ష్యంతో పవన్ ప్రత్యేకంగా ఇక్కడ దృష్టిసారిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇరుపార్టీల మధ్య సమన్వయం

ఉభయ గోదావరి జిల్లాలో పవన్ ఈనెల 14 నుంచి 17 వరకు ఉంటుంది. ఇందులో తొలి రోజు భీమవరంలో పర్యటన ఉంటుంది. 15, 16 అమలాపురం, కాకినాడలో, 17న రాజమహేంద్రవరంలో పవన్ సమావేశాలు ఉండవచ్చునని సమాచారం. ముఖ్యంగా పవన్ పర్యటనలో జనసేన, టీడీపీ నాయకులతో సమావేశం కానున్నారు. ఇరు పార్టీ నాయకులకు, శ్రేణులకు మధ్య మంచి వాతావరణం ఏర్పాటు చేయడం, పొత్తు ఫలితాల లక్ష్యంగా భేటీలు జరిగే అవకాశాలు ఉన్నాయి. మూడు దశల్లో పవన్ పర్యటనలు నిర్వహించాలని భావించారు. తొలి దశలో ముఖ్య నాయకులు, ప్రభావశీలురు, ముఖ్యులతో సమావేశాలు ఉంటాయి. రెండోసారి పర్యటనలో పార్టీ స్థానిక కమిటీల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళల సమావేశాల్లో పాల్గొనేలా కార్యక్రమం ఏర్పాటు చేశారు. మూడోదశలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. ఎన్నికల ప్రచారం చేపట్టే నాటికి మూడుసార్లు ఆయా ప్రాంతాలకు వెళ్లేలా పర్యటన షెడ్యూల్ సిద్ధం చేసుకుంటున్నారు. ఉభయ గోదావరి జిల్లాల పర్యటన తర్వాత ఇతర ప్రాంతాలకు సంబంధించిన పర్యటనలను ఖరారు చేసేందుకు పార్టీ ప్రచార కమిటీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పవన్ పర్యటన ఖరారు కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కలగనుంది.





వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పోటెత్తిన భక్తజనం

గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి

- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38.15లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 10: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, ఐశ్వర్య లక్ష్మీహోమం, బాలభోగం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని ఫలపుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా గోవిందనామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, కానుకలు తీర్చుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.38.15 లక్షలు లభించినట్టు ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, కార్యనిర్వహణాధికారి, డీసీ బి.కిషోర్‌కుమార్ తెలిపారు.

భావనారాయణస్వామి తిరునాళ్లకు ఏర్పాట్లు

- నెలరోజుల పాటు మాఘమాస మహోత్సవాలు





భక్తుల దర్శనార్థం ఏర్పాటుచేసిన బారీకేడ్లు, శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 10: ఉమ్మడి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయంలో ఆదివారం నుంచి నెలరోజులపాటు జరిగే తిరునాళ్లకు అన్నిఏర్పాట్లు పూర్తిచేశారు. మాఘమాస మహోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగే భావనారాయణ స్వామి తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు, ఆలయ ఛైర్మన్ పుల్ల నారాయణరావు తెలిపారు. మొదటి ఆదివారం, ఈనెల 18, 25, మార్చి 3, మార్చి 10వ తేదీల్లో తిరునాళ్ల జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించు కుంటారని భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బారీకేడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భావనారాయణస్వామి తిరునాళ్ల జరిగే ఆదివారాల్లో ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నేడు దళిత సింహగర్జన సభ

- వేమగిరిలో ఏర్పాట్ల పరిశీలనలో మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10: సుమారు 15 ఏళ్ల క్రితం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో లక్షలాది మందితో మాలల సింహగర్జన సభ నిర్వహించిన అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ దళిత వర్గాలకు జగన్ పాలనలో జరిగిన అన్యాయాన్ని వెలుగెత్తి చాటేందుకు ఈనెల 11న రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో దళిత సింహగర్జన సభ నిర్వహిస్తున్నారు. ఇందుకు భారీ ఏర్పాట్లుచేశారు. వేదిక, గ్యాలరీలు, సుమారు 30 వేల మంది కూర్చొనే విధంగా సభా ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. జాతీయ రహదారి సమీపంలో వాహనాల పార్కింగ్‌కు కేటాయించారు. ఏర్పాట్లను శనివారంహర్షకుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ ఆపై దళితుల గొంతు నొక్కాడని, 27 దళిత సంక్షేమ పథకాలను రద్దుచేశారని విమర్శించారు. సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారని, మెడికల్ కళాశాలలో దళితులకు కేటాయించిన సీట్లను సైతం అమ్మేసుకున్నారని ధ్వజమెత్తారు. దళిత సింహగర్జనసభకు దళితులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. గడ్డం సురేష్, శెట్టిరాజా, సైరాభాను, ఎల్‌వీ ప్రతాప్, పాల్గొన్నారు.



వేమగిరిలో దళిత సింహగర్జనకు ఏర్పాటుచేసిన సభాస్థలి

బాలబాలాజీ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి



బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, ఫిబ్రవరి 10: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. భక్తులు వైనతేయ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. స్వామివారిని అర్చకులు వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానంలో జరిగిన లక్ష్మీనారాయణ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శనివారం స్వామివారిని 3,095మంది భక్తులు దర్శించుకుని 2,268మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఏసీ జి.మాధవి తెలిపారు. వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాలద్వారా రూ.1,99,558 ఆదాయం వచ్చినట్టు ఏసీ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ధర్మకర్తల మండలి ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, ఫిబ్రవరి 10: కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధికసంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.3,09,150 అన్నదాన విరాళాలు రూ.73,077ఆదాయం, కేశఖండన ద్వారా రూ.5,920, తులాభారం రూ.650 వెరసి రూ.3,88,797 ఆదాయం సమకూరినట్లు ఆలయవర్గాలు తెలిపాయి.. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.

6100 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

రాజానగరం, ఫిబ్రవరి 10: అక్రమంగా తరలిస్తున్న రూ.31,73,872 విలువగల పీడీఎస్ బియ్యాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్టు రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. రాజానగరం మండలంలోని శ్రీరామనగర్ శివారు నుంచి వ్యాన్‌లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంమేరకు సిబ్బందితో కాపుకాచి వాహనాన్ని పట్టుకున్నామన్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా 122 ప్లాస్టిక్ బస్తాల్లో సుమారు 6100 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామని, వాటి విలువ సుమారు రూ.31,73,872 ఉంటుందన్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు గ్రామం నుంచి గొల్లప్రోలు మండలం బి.ప్రత్తిపాడు గ్రామానికి ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్టు వాహన డ్రైవర్ కరణం సద్గురమూర్తి ద్వారా తమ విచారణలో తేలినట్టు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కె.ఎస్.ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో పీడీఎస్(చౌకబియ్యం) అక్రమనిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగు తుందన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, జిల్లా పౌరసరఫరాల అధికారి విజయభాస్కర్, రాజానగరం సీఎస్‌డీటీ ఎం.కమల్‌సుందర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఈనెల 15 వరకు కాటన్ బ్యారేజ్‌పై రాకపోకలు నిలిపివేత

- కలెక్టర్ మాధవీలత

ధవళేశ్వరం, ఫిబ్రవరి 10: కాటన్ బ్యారేజ్‌పై రహదారి మరమ్మతుల నేపథ్యంలో మరో ఐదు రోజులు రాకపోకలు నిలిపివేస్తున్నట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఈనెల 10కి పనులు పూర్తిచేసి రాకపోకలు పునరుద్ధరిస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపినా పనులు పూర్తికాకపోవడం, కాంక్రీట్ క్యూరింగ్ వంటి పనులు ఉండడంతో మరో 5రోజులు ట్రాఫిక్‌ను మళ్లించాలని ఇరిగేషన్ అధికారులు కోరారు. ఈ పనుల దృష్ట్యా ఈనెల 15 వరకు బ్యారేజ్‌పై రాకపోకలు నిలిపివేస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలుపుతూ ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

- ఆర్ట్స్ కళాశాలలో జీసీటీఏ అధ్యాపకుల రాష్ట్రస్థాయి సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల జీసీటీఏ సంఘం రాష్ట్రస్థాయి కార్యనిర్వాహక సమావేశం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ అధ్యాపకులు కొత్తగా వస్తున్న టెక్నాలజీలను అందిపుచ్చుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, క్షేత్రస్థాయి పరిశోధనలకు పునరంకితం కావాలని కోరారు. జీసీటీఏ వార్షిక డైరీలను ఆవిష్కరించారు. రాష్ట్ర జీసీటీఏ కార్యదర్శి ఎం.శ్యాంబాబు మాట్లాడుతూ అధ్యాపకులకు సర్వీస్ రెగ్యులరైజేషన్ త్వరగా పూర్తిచేయాలని, సీఏస్ ప్రాసెస్ మొదలుపెట్టాలని ఉన్నత విద్యాశాఖను కోరుతున్నట్టు తీర్మానించినట్టు చెప్పారు. వివిధ యాప్‌లపై అధ్యాపకుల నిరసనను పైఅధికారులకు తెలియజేసి సానుకూల స్పందన రాబడతామన్నారు. జీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాఘవరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పి.లలితాశరణ్య, వివిధ జిల్లాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.



జీసీటీఏ వార్షిక డైరీ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

పెళ్లికార్డులు పంచడానికి వెళ్లి అనంతలోకాలకు..

- ఒంటెద్దుబండిని ఢీకొని వ్యక్తి మృతి

కొత్తపేట, ఫిబ్రవరి 10: మేనకోడలు పెళ్లికార్డులు పంచడానికి వెళ్లి శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కొప్పిగుంట గ్రామానికి చెందిన గుబ్బల నారాయణస్వామికి ఇద్దరు కుమార్తెలు. రెండవ కుమార్తెకు వివాహం నిశ్చయం కావడంతో శనివారం తెల్లవారుజామున బావమరిది అయిన ముమ్మిడివరానికి చెందిన కొప్పిశెట్టి రామసుబ్రహ్మణ్యం(43)తో కలిసి బంధువులకు శుభలేఖలు ఇచ్చేందుకు మోటారు సైకిలుపై కాట్రేనికోన నుంచి బయల్దేరారు. రామసుబ్రహ్మణ్యం నడుపుతుండగా నారాయణస్వామి కూర్చున్నాడు. వానపల్లి సమీపంలో అడ్డుకాలువ వద్దకు వచ్చేసరికి మంచుకురవడంతో ఎదురుగా వెళ్తున్న ఒంటెద్దు బండిని గమనించకుండా నేరుగా ఢీకొట్టడంతో ఇద్దరూ కింద పడిపోయారు. నారాయణ స్వామికి స్వల్ప గాయాలు కాగా రామసుబ్రహ్మణ్యానికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామసుబ్రహ్మణ్యం మృతి చెందాడు. నారాయణస్వామి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ డి.శశాంక్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



మృతిచెందిన కొప్పిశెట్టి రాంబాబు

హిందూ ధర్మవ్యాప్తికి కృషిచేయాలి

- సత్యదేవుడి సన్నిధిలో గణపతి సచ్చిదానంద సరస్వతి స్వామీజీ




గణపతి సచ్చిదానందకు స్వాగతం పలుకుతున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, ఫిబ్రవరి 10: హిందూధర్మ వ్యాప్తికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని మైసూరు దత్త పీఠాధిపతులు గణపతి సచ్చిదానంద సరస్వతి స్వామీజీ అన్నారు. శనివారం అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామీజీకి ఆలయ ఈవో రామచంద్రమోహన్, వేదపండితులు ఆలయమర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. దైవారాధన ద్వారానే దైనందిన జీవితంలో పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. సత్యదేవుడి ఆలయం ఎంతో ఖ్యాతి కలిగిందని, ఎప్పటినుంచో ఈక్షేత్రానికి రావాలని సంకల్పం ఉందని స్వామి అనుగ్రహంతో నేటికి నెరవేరిందన్నారు. స్వామీజీకి వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు.

ఏపీఈఏపీసెట్ కార్యాలయం ప్రారంభం

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 10: కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీఈఏపీసెట్) 2024కు సంబంధించిన కార్యాలయాన్ని శనివారం జేఎన్టీయూకే ఉపకులపతి, ఏపీఈఏపీసెట్ ఛైర్మన్ జీవీఆర్ ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇప్పటివరకూ వరుసగా ఏడుసార్లు జేఎన్టీయూకే ఏపీఈఏపీసెట్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించిందన్నారు. త్వరలోనే ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేస్తామన్నారు. కన్వీనర్‌గా వెంకటరెడ్డిని, కోకన్వీనర్లుగా మోహన్‌రావు, నాగేశ్వరరావులను, సమన్వయకర్తలుగా సుమతి, మధు,కృష్ణభాస్కర్‌లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఏ సీహెచ్‌సాయిబాబు, డీఈ బి.బాలకృష్ణ, సీఈ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయా ప్రవేశపరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పెద్దాపురం, ఫిబ్రవరి 10: పెద్దాపురంలోని జవహర్ నవోదయాలో 9వ తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతగా జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా వ్యాప్తంగా ఆరు పరీక్షా కేంద్రాల్లో 1587 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 1070 మంది విద్యార్థులు హాజరయ్యారని, 517 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు.

యెంట్రుకోనలో అల్లుడి వీరంగం

- దాడిలో అత్తతో పాటు మరొకరికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిక్కిరెడ్డి నరేష్

అల్లవరం, ఫిబ్రవరి 10: భార్యను కాపురానికి తీసుకెళ్లేందుకు వచ్చిన అల్లుడు వీరంగం చేయడంతో అత్తతోపాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అల్లవరం మండలం యెంట్రుకోనకు చెందిన తిక్కిరెడ్డి రాజారావు మనవరాలు శిరీషను రాజమహేంద్రవరంలో బ్యాంకు ఉద్యోగం చేస్తున్న బరువు దుర్గాప్రసాద్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. శిరీషను కాపురానికి తీసుకువెళ్లే విషయమై అత్తగారి ఇంటికి వచ్చిన అల్లుడితో ఘర్షణ జరిగింది. దీంతో దుర్గాప్రసాద్ టీవీలు, సామగ్రి ధ్వంసం చేయడం మొదలెట్టాడు. అడ్డు వచ్చిన తిక్కిరెడ్డి నరేష్, అత్త చంద్రావతిలపై దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన వారిద్దరూ అల్లవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దుర్గాప్రసాద్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు అల్లవరం ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ చెప్పారు.

వివాహిత అనుమానాస్పద మృతి



చెట్టుకు ఉరివేసుకుని వేలాడుతున్న మహిళ, ఇన్‌సెట్‌లో దుర్గాభవాని

చాగల్లు, ఫిబ్రవరి 10: చాగల్లు శివారు జగనన్న కాలనీకి సమీపంలో మహిళ చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మీనా నగరానికి చెందిన దుర్గాభవాని(25)కి అదే గ్రామానికి చెందిన జాన శివరామకృష్ణతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వారికి మూడేళ్ల అమ్మాయి, రెండేళ్ల అబ్బాయి ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో కొన్నాళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. దుర్గాభవాని పుట్టింటి వద్దనే పిల్లలతో ఉంటుంది. మూడు రోజులుగా కనిపించడం లేదని ఆమె కోసం వెతుకుతున్నారు. శనివారం జీడిమామిడి తోటలో చెట్టుకు వేలాడుతుండడం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ పి.నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

లారీ ఢీ కొని వృద్ధురాలి మృతి

తునిరూరల్, ఫిబ్రవరి 10: లారీ ఢీ కొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన కాకినాడజిల్లా తుని మండలం తేటగుంటలో శనివారం చోటుచేసుకుంది. ఓ షాపు వద్దకు సిమ్మెంటు లోడుతో వస్తున్న లారీ వెనుక నుంచి కొల్లి నారాయణమ్మ(60) ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై కేసు నమోదుచేసి లారీని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ బి.రమేష్‌బాబు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

తుని రూరల్, ఫిబ్రవరి 10: తుని మండలం ఎర్రకోనేరు గ్రామానికి చెందిన పప్పు త్రిమూర్తులు(32)తుని పట్టణంలో పురుగుల మందు తాగి మృతి చెందినట్టు ఎస్‌ఐ రామలింగేశ్వరరావు తెలిపారు. త్రిమూర్తులు ఒక యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని బ్యాంక్ కాలనీలో నివాసం ఉంటున్నారు. అయితే ఇరువురు మధ్య గొడవలు చోటు చేసుకోవడంతో శుక్రవారం యువతికి పురుగుల మందు తాగించి త్రిమూర్తులు తాగాడు. దీంతో ఇద్దరు అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం త్రిమూర్తులు మృతి చెందగా యువతి కోలుకుంటున్నట్లు ఎస్‌ఐ రామలింగేశ్వరరావు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రముఖులకు భారతరత్న ప్రకటనపై హర్షం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 10: ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడైన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, రైతు బాంధవుడు చరణ్‌సింగ్, హరిత విప్లవ సారధి ఎంఎస్ స్వామినాథన్‌లకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం హర్షణీయమని గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్యక్షుడు, మాజీ సైనికోద్యోగి గోటేటి గంగాధరరావు పేర్కొన్నారు. స్థానిక గోఖలే వీధిలోని కళ్యాణ నిలయంలో సమావేశం ఏర్పాటు చేసారు. కిసాన్ సంఘ్ రాష్ట్ర జన్సినద ఉప్పుగంటి భాస్కరరావు, ఆధ్యాత్మికవేత్త కూచి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

- మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
- చెల్లూరులో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం
- వైసీపీని వీడిన 40 కుటుంబాలు

లోకేశ్ శంఖారావంతో జగన్ ప్రభుత్వం ఇంటికే


కొత్తపేట: మాట్లాడుతున్న బండారు సత్యానందరావు

రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు

కొత్తపేట, ఫిబ్రవరి 10: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించే శంఖారావం జగన్ ప్రభుత్వ పతనానికి నాంది అవుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు అన్నారు. శనివారం కొత్తపేట శివారు ఏసుగులమహల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ అరాచక పాలనలో నష్టపోయినప్రజలకు యువగళం పాదయాత్ర ద్వారా లోకేశ్ భరోసా ఇచ్చారన్నారు. 120 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఆయనపర్యటిస్తారన్నారు. మాజీ జడ్పీటీసీ ధర్నాల రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు సిద్ధంశెట్టి వీర వెంకట సత్యనారాయణ, కొల్లి వీరాస్వామి, కొత్తలంక శ్రీనివాసశర్మ, తోరాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దుర్మార్గాలపై లోకేశ్ శంఖారావం

రాజోలు, ఫిబ్రవరి 10: వైసీపీ ప్రభుత్వ అరాచకాలు, దుర్మార్గాలపై టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌బాబు శంఖారావం పూరించనున్నారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. తాటిపాకలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు ఏవిధంగా నష్టపోయారు, ఏవర్గాలు ఎలా నష్టపోయారనే అంశాలపై శంఖారావం ద్వారా 120నియోజకవర్గాల్లో 50రోజులు కొనసాగుతుందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రాక్షసత్వంతో ప్రజలను, ప్రతిపక్ష పార్టీలను పూర్తిగా అణచివేసిందని విమర్శించారు.

జగన్‌రెడ్డి అరాచకాలపై లోకేశ్ శంఖారావం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 10: జగన్‌రెడ్డి అరాచకాలపై పూరించిన సమరనాదమే శంఖారావమని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. అమలాపురంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో భాగంగా లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం పేరుతో పర్యటించి జగన్‌రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలను ప్రజలకు వివరిస్తారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, దంతులూరి వాసురాజు, బొర్రా వెంకటేశ్వరరావు, వలవల శివరావు, శెట్టిబత్తుల దిన్నాబాబు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారు



రాయవరం: చెల్లూరులో వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరిన పలు కుటుంబాలు, రావులపాలెం: బాబుష్యూరిటీ కార్యక్రమంలో బండారు సత్యానందరావు

రాయవరం, ఫిబ్రవరి 10: చెల్లూరులో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఏపీని అప్పులు ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించిందన్నారు. గ్రామంలో ఇంటింటికి పర్యటించిన ఎమ్మెల్యే చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత అమలుచేసే అభివృద్ధి పథకాలు గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టాలని వేగుళ్ల కోరారు.

వైసీపీని వీడిన 40 కుటుంబాలు:

చెల్లూరు గ్రామానికి చెందిన 40కుటుంబాలు శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దార్ల సుధీర్‌బాబు ఆధ్వర్యంలో ఎస్సీసామాజిక వర్గానికి చెందిన 25కుటుంబాలు, కొప్పిశెట్టి సత్యనారాయణ, కాదా శ్రీను, మామిడిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన 15కుటుంబాలు టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారికి ఎమ్మెల్యే వేగుళ్ల పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చంద్రు వీర్రాజు, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, మాజీ సర్పంచ్ మోరంపూడి రాజ్‌కుమార్, నూనే ఏసుబాబు, కురుపూడి రాజు, పీతల రవికుమార్, మార్ని రాంబాబు, ఎంపీటీసీలు వైట్ల సతీష్, ఉండవిల్లి సుబ్బారాయుడు, వైఆర్కే పరమహంస, కొప్పిశెట్టి మాధవరావు, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ కాదా ప్రభాకరరావు, రిమ్మలపూడి వేణుగోపాలదొర, కోడి చిన్న అప్పారావు, నల్లమిల్లి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే సమగ్రాభివృద్ధి

రావులపాలెం, ఫిబ్రవరి 10: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నా, పేద ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నా టీడీపీ అధికారంలోకి రావడంతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పొడగట్లపల్లిలో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ... భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగాఆయన గ్రామంలో ఇంటింటికీ పర్యటిస్తూ టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేసే అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళిత సింహగర్జనను విజయవంతం చేయాలి

అల్లవరం, ఫిబ్రవరి 10: మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వేమగిరిలో జరిగే దళిత సింహగర్జనను విజయవంతం చేయాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టిబత్తుల తులసీదుర్గారావు పిలుపునిచ్చారు. గోడిలంకలో జరిగిన సమావేశంలో కుంచే చంద్రరావు, శెట్టిబత్తుల బాలకృష్ణ, కాశి శ్రీనివాస్, బల్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహారావుకు పరామర్శ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 10: మాతృవియోగంతో బాధపడుతున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావును శనివారం పలువురు పరామర్శించారు. నరసింహారావును పరామర్శించిన వారిలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మెట్ల రమణబాబు, అల్లాడి సోంబాబు, నల్లా స్వామి, నల్లా చిట్టిబాబు, టేకుమూడి లక్ష్మణరావు, పొద్దోకు నారాయణరావు, పరమట శ్యామ్‌కుమార్, కాశి బాలమునికుమారి, చిక్కాల గణేష్, గంధం పల్లంరాజుతదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

మలికిపురం, ఫిబ్రవరి 10: రాజోలు నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం లక్కవరం, గుడిమెళ్లంక, మేడిచర్లపాలెం గ్రామాల్లో జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, సర్పంచ్‌లు ఎన్.విజయకుమారి, ఎం.వల్లీశ్వరి, కె.పుష్పకుమారి, ఎన్.అంజలి పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పూర్తిచేయాలి

అల్లవరం, ఫిబ్రవరి 10: ఈనెల15వతేదీ లోపు ఈ-పంట నమోదు పూర్తిచేయాలని, వరి రైతులంతా ఈకేవైసీ కూడా తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబుకోరారు. శనివారం ఆయన తాడికోన, గూడాల గ్రామాల్లో ఈ-పంట నమోదును పరిశీలించారు. మండలంలో 4,200ఎకరాల్లో ఈ-పంటనమోదుపూర్తయిందన్నారు. పర్యటనలో ఏవో ఎస్వీవీ సత్యనారాయణ, సీహెచ్ రంజిత్ స్వామి, ఎస్‌కే బిలాల్, దాసరి విజయకుమార్, పట్టెం నాగభూషణం, సబ్బతి సత్తిరాజు, పులిమే కృష్ణ పాల్గొన్నారు.

ఊడుగులమ్మవారి జాతర, తీర్థమహోత్సవాలు

అలమూరు, ఫిబ్రవరి 10: మోదుకూరు గ్రామదేవత ఊడుగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవం శుక్రవారం రాత్రి, శనివారం అమ్మవారి తీర్థమహోత్సవం జరిగాయి. తీర్థమహోత్సవం సందర్భంగా అమ్మవారికి భక్తులు కానుకలు, మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు, పలువురు నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

కనకదుర్గమ్మ ఆలయంలో చండీహోమం

అల్లవరం, ఫిబ్రవరి 10: పెదగరువు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో లక్ష్మీగణపతి పూజ, రుద్రచండీ, మహాలక్ష్మి హోమాలు, కుంకమార్చనలు జరిగాయి. విశ్రాంత ఉన్నతాధికారి నిచ్చెనకోళ్ల సుదర్శనరావు-ఇందిరాకుమారి దంపతుల ఆధ్వర్యంలో కర్తలైన వాసుదేవరావు, ఎంపీటీసీ మౌనిక దంపతులతో మంగళంపల్లి పాండురంగవిఠల్ హోమాలు, పూజలు జరిపించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యాళ్ళ నాగసతీష్, గుడాల పుల్లయ్యశెట్టి, అంగాని రామారావు, కట్టా నారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు.

అముజూరు సొసైటీ అధ్యక్షుడిగా ఏడుకొండలు

కె.గంగవరం, ఫిబ్రవరి 10: అముజూరు సొసైటీ అధ్యక్షుడిగా సాదే ఏడుకొండలు నియమితులయ్యారు. జిల్లా అధికారుల నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన శనివారం తెలిపారు.సొసైటీ చరిత్రలో ఎస్సీ సామాజిక వర్గానికి అధ్యక్ష పదవి ఇవ్వడం సంతోషమన్నారు. ఆదివారం ఏడుకొండలు ప్రమాణస్వీకారం చేయనున్నారు. సర్పంచ్ నానావరపు కల్యాణి, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాబు, వైసీపీనేతలు మేడిశెట్టి శ్రీనివాస్, నానావరపు శ్రీనివాస్, పెంకే రవిచంద్ర, గెద్దాడ సతీష్ అభినందించారు.

పట్టణంలో గడపగడపకు..

రామచంద్రపురం, ఫిబ్రవరి 10: స్థానిక 17వవార్డు మధ్యనగర్, ముచ్చుమిల్లిలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ పర్యటించారు. ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని ప్రజలను కోరారు. చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్‌చైర్మన్లు 1,2 కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న పట్ల హర్షం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 10: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్రం భారతరత్న ప్రకటించడం పట్ల కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు హర్షం ప్రకటించారు. బండారులంకలోని జిల్లా శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పీవీ సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ఎస్సీ సెల్ చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు, నీతిపూడి బాలసత్యనారాయణ, గెడ్డం వెంకటేశ్వరరావు, అప్పన శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమలాపురం పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పేరి శర్మ, ప్రధాన కార్యదర్శిగా మొల్లేటి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పి.నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా డి.సాయిబాబు, కోశాధికారిగా కె.శ్రీనివాసరావులకు ప్రభాకరరావు నియామక పత్రాలు అందించారు. వంటెద్దు బాబి, మొల్లేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ నిధులపై ఆరాతీసిన జడ్పీటీసీకి చుక్కెదురు

- అధికార పార్టీ సర్పంచ్, జడ్పీటీసీ మధ్య వాగ్వాదం
- మండల పరిషత్ బడ్జెట్ సమావేశం


ఎస్సీ నిధులు ఖర్చు చేయకపోవడంపై ప్రశ్నించిన వైసీపీ జడ్పీటీసీ సంపదరావు, సర్పంచ్ బద్రి బాబ్జి మధ్య వివాద దృశ్యం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 10: బడ్జెట్‌లో 15శాతం ఎస్సీ సంక్షేమ నిధులు ఇప్పటివరకు ఎందుకు ఖర్చుచేయలేదన్న అధికార పార్టీ జడ్పీటీసీ.. దీనిపై అధికారపార్టీ సర్పంచ్, జడ్పీటీసీ మధ్య వాగ్వాదం. మానిధులు మాఇష్టమన్న ఎంపీపీ. అరగంటలోనే జారుకున్న సభ్యులు. అంతంతమాత్రంగా అధికారుల హాజరు. ఇదీ శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తీరు. ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్ 2024-25ఏడాదికి మిగులుబడ్జెట్ ప్రవేశపెట్టారు. బడ్జెట్ చదువుతుండగా జడ్పీటీసీ గెడ్డం సంపదరావు గతఏడాది 15శాతంఎస్సీ సంక్షేమ నిధులు ఇప్పటివరకు ఎందుకు ఖర్చు చేయలేదని ఎంపీడీవోను ప్రశ్నించారు. ఎంపీడీవో బదులిసుండగా వైసీపీకి చెందిన సర్పంచ్ బద్రి బాబ్జి మండల నిధులపై ప్రశ్నించే హక్కు మనకులేదని వ్యాఖ్యానించారు. దీంతో సర్పంచ్, జడ్పీటీసీల మధ్య వాదప్రతివాదాలు జరిగాయి. ఎంపీపీ జోక్యంచేసుకుని మండల నిధులపై పెత్తనం మాదేనని స్పష్టీకరించారు.జడ్పీటీసీ మాట్లాడుతూ ఏడాది పూర్తి కావస్తున్నా నిధులు ఖర్చుచేయకపోవడంపై అడిగానని, కారణం చెప్పకుండా ఎదురుదాడి చెయ్యడంపద్ధతికాదన్నారు. ఇతరగ్రామాల్లో ఇళ్ల పట్టాలిచ్చిన వారికి రిజిస్ట్రేషన్ నిలిపివేయడంపై సన్నవిల్లి సర్పంచ్ చిక్కం జంగమయ్య, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిశోర్ తహసీల్దార్‌ను ప్రశ్నించారు. కొంతవ్యవధి పడుతుందని తహసీల్దార్ టి.మల్లికార్జునరావు వివరించారు. గొరగనమూడి డ్రెయిన్‌లో పూడిక తియ్యాలని ఏళ్లతరబడి గగ్గోలు పెడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని సర్పంచ్ జంగమయ్య పలువురు డ్రెయిన్స్ ఏఈ సునీతను ప్రశ్నించారు. రైతులంతా కలెక్టర్‌తో మాట్లాడితే సమస్య పరిష్కారమవుతుందని ఉద్యానవన విశ్వవిద్యాలయ బోర్డు డైరెక్టర్ జిన్నూరి వెంకటేశ్వరరావు సూచించారు. ఎక్కువ మంది అధికారులు గైర్హాజరు కావడంపై సమావేశంలో అసంతృప్తి వ్యక్తమయ్యింది. నిర్దేశిత సమయాని కంటె ఆలస్యంగా వచ్చిన సభ్యులు సమావేశం జరుగుతుండగానే బయటకు వెళ్లిపోవడంతో మిగిలిననలుగురితోనే సమావేశం కొనసాగింది.

రూ.33,800 మిగులు బడ్జెట్

2024-25 ఏడాదికి రూ.57,60,46,000 ఆదాయంగా, రూ.57,60,12,200 వ్యయంగా చూపిస్తూ రూ.33,800 మిగులు బడ్జెట్‌ను సమావేశంలో ప్రవేశపెట్టారు. దీనిపై ఎటువంటి చర్చ జరగలేదు. బడ్జెట్ ప్రవేశపెట్టారేగాని. ఆమోదం కోరకుండానే సమావేశం ముగించడం చర్చనీయాంశమయ్యింది.

అసెంబ్లీ స్థానం స్థానికులకే కేటాయించాలి

పి.గన్నవరం, ఫిబ్రవరి 10: టీడీపీ పి.గన్నవరం అసెంబ్లీ స్థానం స్థానికులకే కేటాయించాలని నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన టీడీపీ నియోజకవర్గ ఎస్సీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ రాష్ట్ర హెచ్ఆర్డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు మాట్లాడుతూ నాయకుల మనోభావాలను టీడీపీ అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. చుట్టుగుళ్ల కిషోర్, నక్కా సత్యనారాయణ, జాలెం సుబ్బారావు, బొండాడ నాగమణి, చిన్నం బాలవిజయరావు, పెదపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలికే పార్టీలకు గుణపాఠం తప్పదు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 10: ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలుకుతున్న ఏ రాజకీయ పార్టీకైనా మాలలంతా గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తప్పుబట్టడంతో పాటు న్యాయవ్యవస్థను కించ పరిచేలా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో జిల్లాశాఖ అధ్యక్షుడు పెయ్యల శ్రీనివాసరావు అధ్యక్షతన మాలమహానాడు కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ వర్గీకరణకు మద్దతు పలికే రాజకీయ పార్టీల నాయకులను మాల పేటల్లోకి రానీయమని హెచ్చరించారు. సమావేశంలో మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు పెయ్యల పరశురాముడు, జిల్లా అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, గూటం సాయి, మాకే సిద్దు, పరమట రాంప్రసాద్, బొంతు శ్రీను, యలమంచిలి బాలరాజు, బూల విజయ్, కొంకి వెంకటబాబ్జి తదితరులు పాల్గొన్నారు.

జనసేన అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తా : గిడ్డి

మామిడికుదురు, ఫిబ్రవరి 10: జనసేన పార్టీ అభివృద్ధికి, పి.గన్నవరం నియోజకవర్గంలో జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేస్తానని జనసేన పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం ఆయన మొగలికుదురు, అప్పనపల్లి, దొడ్డవరం, పెదపట్నంలంక, పెదపట్నం గ్రామాలకు చెందిన జనసేన, టీడీపీకి చెందిన ముఖ్య నాయకులను కలుసుకుని పార్టీ గురించి మాట్లాడారు. అనంతరం అప్పనపల్లిలో కంకిపాటి నరసింహారావు ఇంటి వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, అడబాల తాతకాపు, వాసంశెట్టి కుమార్, కొమ్ముల కొండలరావు, ఎంపీటీసీలు వాసంశెట్టి వెంకటరమణ, బొరుసు పార్వతీదేవి, ఉపసర్పంచ్ జి.దీపిక, నాయకులు తుండూరి బుజ్జి, కొమ్ముల మాధవరావు, మందా గాంధీ, తులా బ్రహ్మాజీ పాల్గొన్నారు.

సింహగర్జన విజయవంతానికి పిలుపు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 10: రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగే దళిత సింహగర్జనకు అధిక సంఖ్యలో దళితులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి చెల్లి అశోక్ పిలుపునిచ్చారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో మెండి కృష్ణబాబు అధ్యక్షతన శనివారం జరిగిన ముమ్మిడివరం నియోజకవర్గ దళిత ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు రావాల్సిన పథకాలన్నీ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పక్క దారి పట్టించిందన్నారు. సమావేశంలో బడుగు జేమ్స్‌పాల్, దుక్కిపాటి సత్యనారాయణ, వడ్డి శ్యాంప్రసాద్, కాశి లాజర్, వై.బాలరాజు, బడుగు సందీప్‌కుమార్, సిద్దిన పెదబాబు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఐ.పోలవరం, ఫిబ్రవరి 10: యానాం-ఎదుర్లంక బ్రిడ్జి వద్ద ప్రజావిరాళంతో నిర్మించిన 93అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. టీటీడీ ఆగమ పండితుడుసుదర్శనం వెంకటజనార్ధనాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ దంపతులు, భూపతిరాజు సుబ్రహ్మణ్యంరాజు, గాయత్రీదేవి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. శనివారం దీక్షాధారణ, వాస్తుసిద్ధి, ప్రధానశాంతిహోమాలు, శిలావిగ్రహ గ్రామోత్సవం నిర్వహించారు. ఈనెల11న విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. భక్తులకు అన్నసమారాధన జరిగింది. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, జడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మోర్త రాణిమిరియం జ్యోతి, పిన్నమరాజు శ్రీనురాజు, పెన్మెత్స చిట్టిరాజు, దంతులూరి రాఘవరాజు, వీరేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 10: డ్వాక్రా మహిళలకు సీఎం జగన్ ఇచ్చిన వరం వైఎస్ఆర్ ఆసరా పథకమని ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. శనివారం స్థానికమార్కెట్ యార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 4విడతలుగా ఇప్పటివరకు 1,504సంఘాలకు రూ.50.18కోట్లు అందజేశామన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు రఘురాం, నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, ఎంపీపీ అంబటి భవానీ మాట్లాడారు. చెక్కులను మహిళలకు అందజేశారు. జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, మండ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాసంశెట్టి లావణ్య, ఏఎంసీ చైర్మన్ పండు గోవిందరాజు, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు,మహిళలు పాల్గొన్నారు.

మండపేట: అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అర్తమూరులో శనివారం సర్పంచ్ గోలుగూరి అన్నపూర్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అర్తమూరు, ఇప్పనపాడు, తాపేశ్వరం, వెలగతోడు, పాలతోడు, మెర్నిపాడు గ్రామాలకు చెందిన 566డ్వాక్రా గ్రూపులకు మంజూరైన ఆసరా రూ.13కోట్ల చెక్కులను మహిళలకు ఆయన అందజేశారు. మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైసీపీ నేతలు రెడ్డి రాధాకృష్ణ ఎంపీపీ ఉండమట్ల వాసు, ఎంపీడీవో శ్రీదేవి, ఈవోపీఆర్డీ రాజు, ఏపీఎం రవిరాజా, పంచాయతీ కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

ఓఎన్జీసీ పరిహారం పంపిణీకి చర్యలు

యానాం, ఫిబ్రవరి 10: యానాంలో మత్స్యకారులకు చమురు సంస్థ నుంచి రావలసిన పరిహారం ప్రభుత్వ ఖాతాలో జమచేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈపరిహారానికి సంబంధించి ఇప్పటికే సీఎంతో పాటు ఇతర మంత్రులు, ఓఎన్జీసీ ఉన్నతాధికారులతో మాట్లాడానని, రెండు రోజుల్లో 5,462మంది లబ్ధిదారుల పరిహారం ప్రభుత్వ ఖాతాలో జమచేసేందుకు ఓఎన్జీసీ సుముఖత వ్యక్తం చేసిందన్నారు. యానాంలో జరిగే సమావేశంలో సీఎంతో పాటు ఇతర మంత్రులు పాల్గొని లబ్ధిదారులకు పరిహారం అందజేస్తారని తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 10: వెలిచేరుకు చెందిన తిరుమలనాధుని ప్రసాద్ ఈనెల5న కూలి పని నిమిత్తం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. భార్య, బంధువులుఅన్నిప్రాంతాల్లో వెతికినా ఆచూకీతెలియలేదు. ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటరమణ	: ఈగల్
శ్రీలలిత	: లాల్‌సలామ్
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: ట్రూ లవర్
రమా	: గుంటూరు కారం
గణపతి	: నాసామిరంగ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: యాత్ర-2
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గేమ్ ఆన్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామచంద్రపురం, ఫిబ్రవరి 10: రామచంద్రపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఏఎస్ఆర్ ఫీడర్, శీలంవారిసావరం ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8నుంచి 11గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు ఏఈ మేడిశెట్టి వెంకటరమణ తెలిపారు. శీలంవారిసావరం, రాజగోపాల్ సెంటర్, వైఎస్సార్ కాలనీ, రైలుగట్టు, శాంతినగర్, గణేష్‌నగర్, వెల్ల రోడ్డు, ఆర్టోస్‌ఫ్యాక్టరీ, బీర్‌ఫ్యాక్టరీ, పెట్రోల్‌బంక్,సినీమ్యాక్స్‌థియేటర్, తోటవారివీధి, అఫీషియల్‌కాలనీ, వెల్లవాటర్‌వర్క్స్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

కాట్రేనికోన: కాట్రేనికోన విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పల్లంకుర్రు ఫీడర్ తిమ్మాపురం-దొంతికుర్రు కండక్టర్‌స్ట్రింగింగ్ పనుల నిమిత్తం ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. తిమ్మాపురం, గెద్దనపల్లి, నడవపల్లి, కుండలేశ్వరం, దొంతికుర్రు, కొప్పిగుంట గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ప్రముఖులను కలిసిన ఎస్పీ రాజశేఖర్

యానాం, ఫిబ్రవరి 10: యానాం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన యు.రాజశేఖర్ పలువురు ప్రముఖులను మర్యాపూర్వకంగా కలిశారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, స్థానిక గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. అనంతరం ఇద్దరు నేతలు ఎస్పీ రాజశేఖర్‌ను సత్కరించారు.

వీరేశ్వరుని దర్శించుకున్న అసిస్టెంట్ కమిషనర్

ఐ.పోలవరం, ఫిబ్రవరి 10: దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ దూనబోయిన నాగమల్లేశ్వరరావు దంపతులు శనివారం మురమళ్ళ భద్రకాళీసమేత వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వారికి ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో వేదాశీర్వాదం అందించారు. స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. పర్యవేక్షణాధికారి బొల్లం వీరభద్రరావు పాల్గొన్నారు.

వెంకట్రాజు మృతి తీరని లోటు: గొల్లపల్లి

అంతర్వేది, ఫిబ్రవరి 10: సఖినేటిపల్లి లంక ఎంపీటీసీ రుద్రరాజు వెంకట్రాజు ఆకస్మిక మృతి తీరని లోటని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. గొల్లపల్లి సూచనతో టీడీపీ మండలాధ్యక్షుడు ముప్పర్తి నాని, పోతురాజు కృష్ణ, చాగంటి స్వామి, తిరుమాని ఆచార్యులు, కొల్లు మహాలక్ష్మి, పడాల శ్రీను, మార్గాన అన్నవరం, కౌరు శ్రీను తదితరులు వెంకట్రాజు భౌతికకాయంపై టీడీపీ జెండా ఉంచి నివాళులర్పించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 10: పట్టణ పరిధిలో రూ.237.16 లక్షలతో చేపట్టిన ఎనిమిది అభివృద్ధి పనులను మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం ప్రారంభించారు. పలు సీసీ రోడ్లతో పాటు 27వ వార్డు ఈడబ్ల్యుఎస్ కాలనీలో రూ.70లక్షలతో నిర్మించిన విశ్వరూప్ కమ్యూనిటీ హాలును ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, కౌన్సిలర్లు బండారు గోవిందు, సంసాని బులినాని, కొల్లాటి దుర్గాబాయి, యెండమూరి గంగ, దంగేటి రుద్ర, చెల్లుబోయిన శ్రీనివాస్, కముజు రమణ పాల్గొన్నారు.

జనసేన పరామర్శ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 10: ఠాణేలంక గ్రామానికి చెందిన దొమ్మేటి వెంకటలక్ష్మి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ శనివారం పరామర్శించారు. అలాగే ముమ్మిడివరం అగ్రహారానికి చెందిన కొప్పిశెట్టి రామసుబ్రహ్మణ్యం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఠాణేలంకలో అనారోగ్యానికి గురై ఇంటి వద్ద చికిత్స పొందుతున్న వెలువలపల్లి సోంబాబును, అదే గ్రామంలో ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న కడలి శ్రీనివాస్, అగ్రహారం గ్రామానికి చెందిన రెడ్డి సత్యప్రసాద్‌ను పితాని బాలకృష్ణ పరామర్శించారు. జక్కంశెట్టి బాలకృష్ణ, విత్తనాల అర్జున్, యలమంచిలి బాలరాజు, పితాని శివ, కడలి రామకృష్ణ, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో పల్లెకుపోదాం కార్యక్రమం

కె.గంగవరం, ఫిబ్రవరి 10: యండగండి, పామర్రు, కోటిపల్లి, మసకపల్లి, పేకేరు, ఎర్రపోతవరం, సుందరపల్లి, సత్యవాడ, తామరపల్లి, గంగవరం గ్రామాల్లో బీజేపీ నేతలు పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నేత కర్రి చిట్టిబాబు పాల్గొని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో గుర్రాల సత్యనారాయణ, కె.జగన్నాథరాజు, సలాదిశేఖర్, ఏవీ రమణమూర్తి, కోడూరి జయలక్ష్మి, సలాది రామకృష్ణసలాది అర్జున్, పోలిశెట్టి త్రిమూర్తులు, బళ్లెం వెంకటస్వామి, సలాది సురేష్, కె.చంద్రరావు, వాసంశెట్టి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: వానపల్లి, బిళ్లకుర్రు, అవిడి, మోడేకుర్రు గ్రామాల్లో శనివారం పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ శ్రేణులతో కలిసి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. నాయకులు గొలకోటి వెంకటేశ్వరరావు, కోటిపల్లి సుబ్రహ్మణ్యం, పాలాటి మాధవస్వామి, ఎ.సుధాకర్, ఇళ్ళ పల్లంశెట్టి, కుడపూడి దావీద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: చెయ్యేరులో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకుపోదాం కార్యక్రమం జరిగింది. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పార్టీ జిల్లా కోశాధికారి గ్రంధి నానాజీ, ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌చార్జి గొలకోటి వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మట్టా సూరిబాబు, కార్యదర్శి కొడమంచిలి సురేష్, కోటా సత్యప్రసాద్, సుంకర నాగేశ్వరరావు, పి.చంటి, పలివెల రాజు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ప్రధాని మోదీ హయాంలోనే దేశం తద్వారా రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుదీష్ రాంబొట్ల అన్నారు. మండలంలో జిల్లా పల్లెకుపోదాం కార్యక్రమ కన్వీనర్ చెరుకూరి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో జరిగిన పల్లెకుపోదాం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పితాని వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి సాయిబాబు, చీకరమిల్లి శ్రీనివాసరావు, గిడ్డి ఏడుకొండలు, కుడిపూడి సూర్యనారాయణ, ఖండవల్లి దీక్షితులు, భమ్మిడి వెంకటసూర్య ఉమాగణేష్ పాల్గొన్నారు.

అంబాజీపేట: కేంద్రంఅందిస్తున్న నిధులు, పథకాలను వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని బీజేపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ కొల్లి సూర్యారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పల్లెకుపోదాం కార్యక్రమాన్ని సీనియర్ నాయకుడు గొనెమడతల కనకరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు చెరుకూరి గోపాలకృష్ణ, సీహెచ్ వెంకటేశ్వరరావు, అప్పన గణపతిరావు, కముజు శ్రీను, గుంటూరి సత్యవర్మ, గుత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడిగా చిన్నారావు

మండపేట, ఫిబ్రవరి 10: మండపేట మండల, పట్టణ ప్రైవేటు పాఠశాల అసోసియేషన్ నూతనఅధ్యక్షుడిగా ఎంపీఎస్ పాఠశాల కరస్పాండెంట్ వల్లూరి చిన్నారావు ఎంపికయ్యారు. మండపేటలో జరిగిన కార్యక్రమంలో సంఘ కార్యదర్శిగా విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ దుర్గా ప్రసాద్ ఎన్నికయ్యారు. పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.

రూ.20లక్షల సీఎం సహాయనిధి మంజూరు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 10: కామనగరువు ఎంఎస్ఎన్ కాలనీకి చెందిన కంచర్ల భైరవమూర్తి ఊపిరితిత్తులు మార్పిడికి రూ.20లక్షలు సీఎం సహాయనిధి మంజూరు చేసిన పత్రాన్ని శనివారం భట్నవిల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి పినిపే విశ్వరూప్ బాధిత కుటుంబానికి అందజేసారు. నాయకులు రేవు శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ హర్షం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 10: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం లభించడం పట్ల ముమ్మిడివరం కాంగ్రెస్ పార్టీ సమావేశం హర్షం వ్యక్తం చేసింది. ముమ్మిడివరంలో పి.ఉదయభాస్కరవర్మ అధ్యక్షతన శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమావేశం జరిగింది. సమావేశంలో పెన్మెత్స జగ్గప్పరాజు, గెడ్డం సురేష్‌బాబు, వడ్డి నాగేశ్వరరావు, గోడి భాస్కరరావు, కాశి అచ్యుతరామయ్య, సాధనాల రాజాజీ పాల్గొన్నారు.